క్లుప్తంగా

సబ్బవరంలో రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సబ్బవరం: సబ్బవరం సెక్షన్–1, సెక్షన్–2లోని సబ్బవరం, అంతకాపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలోని సబ్బవరం రూరల్, అంతకాపల్లి రూరల్, గుల్లేపల్లి రూరల్ ఫీడర్లలో విద్యుత్ లైన్ల నిర్వహణ పనుల కారణంగా మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, ఆయా ప్రాంతాల్లోని విద్యుత్ వినియోగదారులు గమనించాలని సూచించారు.

48 మద్యం సీసాలు స్వాధీనం

పరవాడ: తానాం గ్రామంలో ఓ పాన్‌షాపు యజమాని అక్రమంగా తరలిస్తున్న మద్యం సీసాలను దాడి చేసి స్వాధీనం చేసుకున్నామని పరవాడ సీఐ ఎస్.బాలసూర్యారావు తెలిపారు. గ్రామానికి చెందిన ఎస్.వి.లక్ష్మి పాన్‌షాపులో అక్రమ మద్యం అమ్మకాలు సాగించడానికి మద్యం సీసాలు తరలిస్తున్నారన్న సమాచారం అందడంతో పోలీసులు బుధవారం దాడి చేసినట్లు చెప్పారు. అక్రమంగా తరలిస్తున్న రూ.7520 ఖరీదు చేసే 48 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని, సదరు వ్యక్తిపై కేసు నమోదు చేశామని తెలియజేశారు.

బైపాస్‌పై లారీ బోల్తా



బోల్తా పడిన లారీ

పెందుర్తి: ఆనందపురం–అనకాపల్లి బైపాస్ రహదారి రాంపురం వద్ద సిమెంట్ లోడుతో వెళుతున్న లారీ బోల్తా పడింది. అనకాపల్లి నుంచి ఒడిశా వైపు వెళుతున్న లారీ రాంపురం వద్దకు వచ్చేసరికి అదుపు తప్పడంతో డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేకులు వేశాడు. దీంతో లారీ బోల్తా పడింది. అదృష్టవశాత్తు లారీ సిబ్బంది చిన్నపాటి గాయాలతో బయటపడ్డారు.

'సహిత' ఉపాధ్యాయుల జీతం పెంపుపై హర్షం

సబ్బవరం: సమగ్ర శిక్షలో పనిచేస్తున్న సహిత విద్య ఉపాధ్యాయుల జీతం పెంపుపై జిల్లా ఐఈఆర్‌టీల యూనియన్ అధ్యక్షుడు బండారు సింహాద్రప్పడు హర్షం వ్యక్తం చేశారు. 23 శాతం జీతం పెంచినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణలకు ఆయన సహిత ఉపాధ్యాయుల తరపున ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలియజేశారు. సర్వీసు, అర్హతను బట్టి మినిమం టైం స్కేల్‌ను అమలు చేసి తగిన న్యాయం చేయాలని కోరారు. ప్రతి పాఠశాలలో దివ్యాంగ విద్యార్థుల కోసం ఓ ప్రత్యేక ఉపాధ్యాయుడు ఉండాలని కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిందని ఆయన గుర్తు చేశారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన



శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

సబ్బవరం: మండలంలోని గాలిభీమవరం గ్రామంలో ఆర్యభట్ట పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో ఆర్యభట్ట కళాశాల విద్యార్థులతో పాటు గాలి భీమవరం, లగిశెట్టిపాలెం, ఆరిపాకలోని స్థానికులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందు లు అందజేశారు. శిబిరంలో సుమారు 200 మందికి వైద్యపరీక్షలు చేసి, మందులు అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.నాగభూషణరావు, వైద్య సిబ్బంది, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

27న శ్రీకృష్ణ మందిర వార్షికోత్సవం



ముస్తాబవుతున్న ఉత్సవ విగ్రహం

కంచరపాలెం: ఈ నెల 27న గొల్లకంచరపాలెంలోని శ్రీకృష్ణ మందిర వార్షికోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షుడు గోకాడ ఉదయ్‌భాస్కర్ తెలిపారు. ఆరోజు వేకువజాము 5 గంటలకు ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు. ఉదయం 7 గంటల నుంచి స్వామికి విశేష పూజలు, మధ్యాహ్నం అన్నసమారాధన, సాయంత్రం భజన సంకీర్తన కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, భక్తులు తరలిరావాలని ఆయన కోరారు.



పరవాడ-భర్నికం గ్రామాల మధ్య నిర్మించిన బీటీ రోడ్డు



పరవాడ-తాడి గ్రామాల మధ్య నిర్మించిన బీటీ రోడ్డు

అద్దంలా రహదారులు

- మారుమూల గ్రామాలకు బీటీ రోడ్లు
- గ్రామస్తుల హర్షాతిరేకాలు

అభివృద్ధి చేసిన రహదారులు

వాడచీపురుపల్లి - ఇస్సన్నపేట
రూ.82.06 లక్షలు

పరవాడ - భర్నికం రోడ్డు
రూ.65 లక్షలు

పరవాడ - తాడి రోడ్డు
రూ.2 కోట్లు



వాడచీపురుపల్లి-ఇస్సన్నపేట గ్రామాల మధ్య నిర్మించిన బీటీ రోడ్డు

పరవాడ: మారుమూల గ్రామాలకు వెళ్లే రహదారులు అద్దంలా మెరుస్తున్నాయి. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో అధ్వాన రహదారులు సైతం బీటీ రోడ్లుగా రూపుదిద్దుకుని జిగేల్‌మంటున్నాయి. పరవాడ మండల పరిధిలో పలు మారుమూల రహదారులను ప్రభుత్వం అభివృద్ధి చేయడంతో ఆ ప్రాంత ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

➨ వాడచీపురుపల్లి- ఇస్సన్నపేట గ్రామాల మధ్య గుంతలమయంగా మారిన రహదారితో ఇరు గ్రామాల ప్రజలు నరకం చూసేవారు. అక్కడి ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం రూ.82.06 లక్షలతో ఇస్సన్నపేట రోడ్డును బీటీ రోడ్డుగా తీర్చిదిద్దింది. సౌకర్యవంతమైన రహదారిని నిర్మించడంతో ఆ గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

➨ గుంతలతో నిండి తరచూ ప్రమాదాలకు నిలయంగా మారిన పరవాడ–భర్నికం గ్రామాల మధ్య రహదారితో ప్రజలు నిత్యం అవస్థలు ఎదుర్కొనే వారు. అధ్వాన రహదారిని అభివృద్ధి చేయాలని ఇరు గ్రామాల ప్రజలు ప్రభుత్వానికి విన్నవించడంతో ప్రభుత్వం రూ.65 లక్షలతో సదరు రహదారిని బీటీ రోడ్డుగా అభివృద్ధి చేసింది. దీంతో ఈ రోడ్డుపై ప్రయాణికులు సాఫీగా రాకపోకలు సాగిస్తున్నారు. ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

➨ పరవాడ–తాడి గ్రామాల మధ్య రహదారి గతంలో అధ్వానంగా ఉండేది. కనీసం మరమ్మతులకు కూడా నోచుకోకపోవడంతో తాడి, తానాం, ఫార్మాసిటీ, పరవాడ గ్రామాల ప్రజలు నిత్యం అవస్థలు పడేవారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం రూ.2 కోట్ల రూపాయలను వెచ్చించి సుమారు నాలుగు కిలో మీటర్ల రహదారిని తారు రోడ్డుగా అభివృద్ధి చేయడంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆలయ ట్రస్ట్‌బోర్డ్ ప్రమాణ స్వీకారం



సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్ : ఇసుకకొండ (బాబాజీకొండ)పై వెలసిన సత్యనారాయణస్వామి ఆలయ ట్రస్ట్ బోర్డ్ ప్రమాణ స్వీకారోత్సవం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు టర్నర్‌చౌల్ట్రీ నుంచి ఆలయం వరకు ర్యాలీ చేపట్టారు. కోలాటం, మేళతాళాలు, డప్పు వాయిద్యాల నడుమ ర్యాలీ సాగింది. ఆలయ ఈవో బుద్ధ నాగ జగదీష్, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ సమక్షంలో సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రసిద్ధి చెందిన సత్యనారాయణ స్వామి దేవస్థానం ప్రతిష్ఠ మరింత పెంచే విధంగా అభివృద్ధికి సమన్వయంతో పని చేయాలని సూచించారు. పెంటపల్లి వెంకట్, చింతపల్లి సత్యవతి, బెవర దేవి మహేష్, చిన్నా శ్రీధర్, బెరా అశోక్, మానేపల్లి రమణి, బుడ్డిగ మాధవి, ఫణిహార నరసింహమూర్తితో ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం చేయించారు.

అనంతరం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొరిపల్లి ఆనంద్ మాట్లాడుతూ కష్టపడిన వారిని గుర్తించిన ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తామంతా కలిసి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కె. శిరీష, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, 36వ వార్డు నాయకుడు మాసిపోగు రాజు, 30వ వార్డు కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం, పెంటపల్లి సత్యనారాయణ, మండల అధ్యక్షుడు పీతల వాసు, జెర్రిపోతుల ప్రసాద్, వడ్డాది దిలీప్, నీలాపు లక్ష్మి, దశమంతుల మాణిక్యాలరావు, సనపల రవీంద్ర, కాకి పద్మ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు భక్తిశ్రద్ధలతో నిత్య కల్యాణం



స్వామివారికి యజ్ఞోపవీత ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: సింహగిరిపై శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 గంటలకు స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా సాగింది. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం అందజేశారు.

వైభవంగా శ్రీవారికి పుష్పయాగం



పుష్పయాగానికి తరలివచ్చిన పూలు శ్రీవారికి నివేదించిన దృశ్యం

ఎంవీపీ కాలనీ: స్థానిక సెక్టార్–6లో కొలువైన శ్రీవేంకటేశ్వరస్వామి, శ్రీప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం మహాపూర్ణాహుతి, అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ చక్రత్తాళ్వార్‌తో భక్తుల అప్పుఘర్ తీరంలో సముద్ర స్నానం చేసి తరించారు. అనంతరం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో శ్రీవారికి వైభవంగా పుష్పయాగం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పుష్పాలు తొలుత స్వామివారికి నివేదించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

24, 25 తేదీల్లో బీఎంఎస్ రాష్ట్ర మహాసభలు

అక్కిరెడ్డిపాలెం: బీఎంఎస్ 4వ రాష్ట్ర మహాసభలు ఈ నెల 24, 25 తేదీల్లో 69వ వార్డు షీలానగర్‌లోని బీవీకే స్కూల్ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు బీఎంఎస్ కార్యదర్శి శరగడం చంద్రశేఖర్ బుధవారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భారతీయ మజ్దూర్ సంఘ్ అఖిల భారత అధ్యక్షులు హిరణ్మయ పాండ్యా, ఉపాధ్యక్షులు మళ్ల జగదీశ్వరరావు, దక్షిణ మధ్య క్షేత్ర సంఘటన మంత్రి ఎస్.దురై రాజ్, ఎన్ఈసీ మెంబర్ ఆషామోల్ పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా సంఘటిత, అసంఘటిత రంగానికి చెందిన కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారన్నారు.

సామెతలు, జాతీయాలు గొప్ప సంపద



మాట్లాడుతున్న డాక్టర్ డి.వి.సూర్యారావు

సీతంపేట: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో 'తెలుగు పలుకుబడులు, వైచిత్రి' అనే అంశంపై రచయిత, డాక్టర్ డి.వి.సూర్యారావు ప్రసంగించారు. తెలుగు భాషకు సామెతలు, జాతీయాలు గొప్ప సంపదని అభివర్ణించారు. తెలుగు జాతికి, తెలుగు భాషకు సొంతమై పరభాషలోకి అనువదించి చెప్పలేనివి ఆ జాతి సంస్కృతిని ప్రతిబింబించేవి జాతీయాలుగా పేర్కొన్నారు. ఇంచుమించుగా వాటినే పలుకుబడులుగా పరిగణిస్తామన్నారు. కొన్ని పదబంధాలలో ఇమిడి ఉన్న అర్థాలను వివరించారు. కార్యక్రమంలో సహృదయ సాహితి సంస్థ అధ్యక్షుడు శేఖర మంత్రి ప్రభాకర్, ఎస్.విజయ్‌కుమార్, సిహెచ్.చిన సూర్యనారాయణ, పరవస్తు ఫణిశయన సూరి, కొత్తూరి రమణ, కె.భీమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డీఈవో ఆకస్మిక తనిఖీ

సింథియా: జీవీఎంసీ 62వ వార్డు త్రినాథపురంలోని ప్రభుత్వ పాఠశాలలో బుధవారం జిల్లా విద్యాధికారి చంద్రకళ ఆకస్మిక తనిఖీలు చేశారు. విద్యార్థుల వర్క్ బుక్స్‌ను పరిశీలించి, వాటిని చదివించారు. విద్యార్థులకు పలు సూచనలిచ్చిన డీఈవో.. వారి హాజరుపై ఆరా తీశారు. విద్యార్థుల పుస్తక పఠనం తీరుపై సంతృప్తిని వ్యక్తం చేస్తూ మన జిల్లా మొదటి స్థానం పొందే అవకాశం ఈ పాఠశాలకు ఉందని పిల్లలను, ఉపాధ్యాయులను ఆమె అభినందించారు. అనంతరం విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యత ఉండేలా చూడాలని ప్రధానోపాధ్యాయిని రమణికుమారికి డీఈవో సూచించారు. మండల విద్యాధికారులు త్రినాథరావు, ఎల్.వెంకటరావు, సీఆర్పీలు డి.కృష్ణారావు, సిహెచ్.సునీత, పి.ఈశ్వరరావు, ఇతర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కమనీయం.. సీతారాముల కల్యాణం



సీతారాములకు పూజలు చేస్తున్న దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శిరీష దంపతులు

సీతమ్మధార: నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వరస్వామి, అయ్యప్ప, షిర్డీసాయి బాబా దేవాలయంలో బుధవారం సీతారాముల కల్యాణం, పట్టాభిషేక మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రధాన అర్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల నుంచి గణపతి పూజ అనంతరం కల్యాణం, పట్టాభిషేకం 1.30 గంటల వరకు జరిపారు. ఆలయంలో ఈ నెల 12 నుంచి 21 వరకు పది రోజుల పాటు శ్రీమద్రామాయణ పారాయణం నిర్వహించారు. సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించాచారు. దేవదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శిరీష దంపతులు సీతారాములను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ధర్మకర్తల మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆర్టీసీ స్టీల్‌సిటీ అసిస్టెంట్ మేనేజర్ బదిలీ

ఉక్కునగరం: ఆర్టీసీ స్టీల్ సిటీ డిపో అసిస్టెంట్ మేనేజర్ జి.రమణమూర్తి సింహాచలం డిపోకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సిటీ ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ పి. శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా బుధవారం డిపో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు ఆయనను సత్కరించారు. నూతన అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాసరావుకి బొకే అందజేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో డిపో అధికారులు పలువురు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నివారణపై అవగాహన



హెల్ప్ లైన్ గురించి వివరిస్తున్న కళాకారులు

గాజువాక: ఎయిడ్స్ నియంత్రణపై విశాఖ జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన ప్రదర్శనలు నిర్వహించారు. యాక్సెప్ట్ సీసీ టీఐ నేతృత్వంలో తేజస్విని కళాజాత బృందం కొత్తగాజువాక జంక్షన్ వద్ద నాటికల ద్వారా ప్రచారం నిర్వహించారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ వంటి ప్రాణాంతక వ్యాధులు, సుఖవ్యాధులు సంక్రమించే విధానాన్ని, వాటి నివారణకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలన్న అంశాలను నాటికల ద్వారా వివరించారు. బాధితులు ఏఆర్‌టీ మందులను ఉపయోగించుకోవాలని, అత్యవసర సమయంలో 1097 హెల్ప్‌లైన్ సహాయం తీసుకోవాలని సూచించారు. హెచ్ఐవీ, ఎయిడ్స్‌తో బాధపడుతున్న వారిపై ఎటువంటి వివక్ష చూపించొద్దని వివరిస్తూ ఈ ప్రదర్శనలను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ ఎం.పోలినాయుడు, ఢిల్లీశ్వరి, జయమ్మ, కృష్ణవేణి, రషీత, లక్ష్మి, అప్పారావు, కళాజాత కో–ఆర్డినేటర్ దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

అదీప్‌కు ఆత్మీయ ఆలింగనం





శారదాపీఠానికి విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అదీప్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన్ను ముఖ్యమంత్రి ఆత్మీయ ఆలింగనం చేసుకుని, శుభాకాంక్షలు తెలియజేశారు. - పెందుర్తి

అప్పన్న సన్నిధిలో నేవల్ ఉన్నతాధికారి



వి.శ్రీనివాస్‌కు స్వామివారి జ్ఞాపిక అందిస్తున్న సూపరింటెండెంట్ కనకరాజు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామిని బుధవారం సదరన్ నేవల్ కమాండ్, ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్, వైస్ అడ్మిరల్ వి.శ్రీనివాస్ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అంతరాలయంలో అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రం, జ్ఞాపిక అందించారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో గురుకుల విద్యార్థి ప్రతిభ

- చిత్రకళలో టెన్త్ విద్యార్థిని మధు తేజశ్రీకి ప్రథమ బహుమతి
- మంత్రి చేతుల మీదు ల్యాప్‌టాప్ అందజేత



మంత్రి వేణుగోపాలకృష్ణ నుంచి బహుమతి అందుకుంటున్న మధుతేజశ్రీ

పరవాడ: ట్రూ గుడ్ మిల్లెట్ చిక్కీ సంస్థ ఆధ్వర్యంలో రాజమండ్రిలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి చిత్రకళా పోటీల్లో తానాం మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల పదో తరగతి విద్యార్థిని పి.మధు తేజశ్రీ ప్రథమ బహుమతి గెలుచుకుందని పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.అప్పలనాయుడు తెలిపారు. ఈ సందర్భంగా మధుతేజశ్రీకి రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, సంస్థ అధినేత భూపతిరాజు చేతుల మీదుగా ల్యాప్‌టాప్‌ను అందజేశారు. ఈ సందర్భంగా మధు తేజశ్రీని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల ప్రిన్సిపాల్ మీసాల అప్పలనాయుడు, ఉపాధ్యాయ బృందం ఆమెకు అభినందనలు తెలిపారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం



మాతృభాషా దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు



పెందుర్తి శాఖా గ్రంథాలయంలో బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

సబ్బవరం: సబ్బవరం శాఖా గ్రంథాలయంలో మాతృభాషా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ అధికారి వి.శిరీష మాట్లాడుతూ దేశ భాషలందు తెలుగు లెస్స అని శ్రీకృష్ణ దేవరాయులు తెలుగుభాష ఔన్నత్యాన్ని కొనియాడారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలు పాఠశాలల విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

పెందుర్తి: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా పెందుర్తి శాఖ గ్రంథాలయంలో బుధవారం వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ కనబరిచారు. విజేతలకు పెందుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఉమ, జగదీషల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. గ్రంథాలయాధికారి బి.సూర్యకళ, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

ఐద్వా సమావేశాల పోస్టర్ ఆవిష్కరణ



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న ఐద్వా ప్రతినిధులు

ఉక్కునగరం: ఐద్వా జాతీయ కార్యవర్గ సమావేశాలు జయప్రదం చేయాలని ఐద్వా స్టీల్ డివిజన్ నాయకులు కోరారు. ఉక్కునగరంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఐద్వా సమావేశాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ మహిళలపై పెరుగుతున్న హింస, పరిశ్రమల ప్రైవేటీకరణ ప్రభావం, నిత్యావసర ధరల పెరుగుదల తదితర అంశాలపై ఈ నెల 22 నుంచి 25 వరకు విశాఖలో జరిగే కార్యవర్గ సమావేశాల్లో విస్తృతంగా చర్చించనున్నారన్నారు. కార్యక్రమంలో స్టీల్ జోన్ కార్యదర్శి కె.వేణు, కార్యవర్గ సభ్యులు జి.పుష్ప, వి.సుమలత, ఎ.సూర్యప్రభ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ మ్యాజిక్ సదస్సులో విజయకుమార్‌కు మెడల్



మెడల్ అందుకుంటున్న విజయకుమార్

ఉక్కునగరం: జాతీయ మ్యాజిక్ సదస్సులో స్టీల్‌ప్లాంట్ విశ్రాంత అధికారి కె.విజయకుమార్‌కు మెడల్ లభించింది. ఈ నెల 18న చెన్నైలో టీచ్ ఆడిటోరియంలో మేజికా–2024 పేరిట జాతీయ మ్యాజిక్ సదస్సు నిర్వహించారు. సదస్సులో దేశవ్యాప్తంగా 150 మంది మెజీషియన్లు పాల్గొన్నారు. సదస్సులో భాగంగా అబ్దుల్ కలాం వరల్డ్ రికార్డ్ పేరిట ఈవెంట్ నిర్వహించారు. అందులో 60 మంది మెజీషియన్లు వరల్డ్ రికార్డ్ కోసం తమ ప్రదర్శనలు అందించారు. అందులో విజయకుమార్ ప్రదర్శనకు ప్రత్యేక మెడల్ లభించింది. ఈ సందర్భంగా విజయకుమార్‌ను ఉక్కు ఉద్యోగులు పలువురు అభినందించారు.